# ‘‘దొంగ’’
## ‘‘దొంగ... దొంగ’’

బజారులోని రెండు వేపులా వున్న ఇళ్ళలో నుంచి పెద్దగా - వెర్రిగా వినిపిస్తున్నాయి.

ఒకతను మాత్రం చావు దెంపుల మీద గసపెడుతూ పరుగెట్టడం కిటికీల నుంచీ, మేడల పైభాగం నుంచీ గమనించి ఎక్కడివారక్కడే బిగుసుకుపోయారు. కీచుగా ‘‘అవును దొంగ. అదుగో- అటు’’అంటూ క్రింది బజారులో కనిపిస్తున్న వారికి సైగ చేస్తున్నారు.

కొందరు పరుగెత్తుతున్న దొంగను పట్టుకునేందుకు వెనక చెదురుమదురుగా వెంబడించారు. దొంగ నందుకోవాలనే ప్రయత్నం ఎందరికుందో అంతగా అర్థం కాదు గానీ, మొత్తానికి వెంట బాగానే పరిగెడుతున్నారు. ఈ పరుగు దొంగ వెళ్తున్న దిశను చూడడానికి బాగానే పనికొస్తుంది.

‘‘రాముడూ! అడ్డం తిరుగు. ఈ సందు చివరన దోవ ఆగిపోతుంది’’ అన్నాడొకడు పరుగెడుతూనే.

అటుగా మళ్ళారు ఇద్దరు ముగ్గురు.

అందులో రాముడనేవాడు కూడా వుండి వుంటాడు.

అయితే సూటిగా వెళ్ళినంత వేగం అడ్డం తిరిగివాక రామూ వారిళ్ళ దగ్గర కనిపించలేదు.

‘‘ఆ చెప్పినతనే ముందెత్తుగా ఇటు వెళ్ళవచ్చును గదా! నా కెందుకు చెపుతున్నాడు’’ అన్న అనుమానం రాముడి మెదదులో మొలవడంతో పరుగు నడక క్రింద మారింది. ‘అయినా పరుగెడుతున్నవాడు అస్సలే దొంగ కదా! అడ్డం తిరిగిన మొదటి వాడ్ని నేనే అవుతాను కనుక చేతికందిన దాంతో తిరగబడితే? రాయో రప్పో విసిరితే? చాకు చూపిస్తే? జరగరానిది జరిగింతరువాత- అడ్డం తిరగమన్న వెధవ లేం చేయ గలరు? ఓదార్చడం తప్ప! ఇలా ఆలోచనలు సాగుతు న్నంతలోనే దొంగ మొండిగోడ దూకి ఎదుటి సందులో జొరబడ్డాడు.

‘‘మొండి గోడ దూకేసి పరుగెత్తుతున్నాడు. ఇటు.. ఇటు’’ అని ఆగి పెద్దగా అరిచాడు రాముడు. అంతటితో బాధ్యత పూర్తయినట్లు.

‘‘నువ్వూ గోడదూకు. వెంటబడు’’ అన్నారెవరో.

‘‘అమ్మో! నా చేతకాదు’’ అని ఠక్కున ఆగిపోయాడు రాముడు.

‘‘దూకండి. పట్టుకోండి’’ అంటూ మొండి గోడ




దాకా వచ్చి ఆగారు జనం. నల్గురయిదుగురు మాత్రం గోడ దూకే ప్రయత్నంలో మొండి గోడ నెక్కారు. ఒక్కడు ధైర్యం చేసి పార చూసి ‘‘అదిగో! పున్నమ్మ సారాయి కొట్టు మలుపులో వెళ్తున్నాడు’’ అంటూ దూకాడు. అతన్ననుసరించుతున్న మరొకడు బాగా ఎక్కి చూసి ‘‘కుంటుతున్నాడు వెధవ. ఈ దూకుడులో కాలు మెలికపడి వుంటుంది. ఇక ఎంతో దూరం వెళ్ళలేడు’’ అంటూ మెల్లగా మొండి గోడ నుంచి క్రిందికి జారి జనం వైపుగా చూస్తూ ‘‘రండి’’ అని- పున్నమ్మ సారా కొట్టువైపుగా పరుగు ప్రారంభించాడు. మొండిగోడ కవతల వున్న వారిళ్ళలో కొందరు ధైర్యం చేసి ఇవతలకొచ్చి అనుసరించారు.

చాలా దూరం దొంగ వెంట పరుగెత్తడం మూలాన అలసటతో రొప్పుతూ, పరుగెత్తలేక పరుగెత్తుతూ- అలా గట్టిగా వెంబడించకపోతే దొంగ దొరకడేమోననే భావ నతో మందలో కలిసి వాళ్ళు వెళ్తున్న వైపుగా జనాంతి కంగా పరుగెడుతూనే వున్నారు.

పున్నమ్మ సారాయి కొట్టు వద్ద ఆగారు. ఆగి రొప్పుతూనే-

‘‘పున్నమ్మా! ఏడి వాడు? దొంగ వెధవ ఎక్కడ?’’ అన్నారు అరుస్తున్నట్టుగా గజిబిజిగా.

‘‘ఎవరూ?’’ అంటూ బైటకొచ్చింది పున్నమ్మ జాడీ దగ్గర గ్లాసులూ గ్రటా సర్ది- సుతారంగా గుంపును చూస్తూ.

‘‘ఇటుగా ఓ దొంగ వెధవ పరుగెత్తుకుంటూ వచ్చాడు. ఇంతకుముందే నీ కొట్టు మలుపులో కనిపించాడు. నిజం’’ అన్నాడొకడు వివరణనిస్తూ.

‘‘నా కొట్లో కెవ్వరూ రాలేదే? అయినా నా కాడకొచ్చేవాడు త్రాగుబోతు వెధవై వుంటాడు గానీ- దొంగ కాకూడదు’’ అంది.

‘‘అంతే... అంతే’’ అంటూ గుంపు ముందుకు కదిలింది.

‘‘అడిగో! అటు రోడ్డు దాటుతున్నాడు. పట్టుకోండి’’ అన్నారెవరో పెద్దగా.

రోడ్డు వైపుగా చూసారు జనం పరుగెత్తుతూనే.

‘‘అవును! అతగాడే!’’ అన్నాడొకడు ఆగి పరిశీలించి. ‘‘అయితే పదండి’’ అంటూ కొంచెం వేగం పెంచి మరీ కదిలారు..

అయితే-

రోడ్డు దాటేసరికి బయలుదేరినప్పుడున్న జనంలో సరిగ్గా సగం మంది మాత్రమే మిగిలారు.

రోడ్డెక్కి వెనక్కి తిరిగాడు చందూ.

‘‘అరే! వెనక జనమంతా ఏరి’’ అని ఠక్కున ఆగిపోయాడు.

ఫర్లాంగు దూరం అవతల. మనిషి మాత్రం స్పష్టంగా కనిపించాడు.

పల్లె నుంచి పాలు తెస్తున్న ఓ సైకిలు ఎదురొస్తూ కనిపించింది. ఆపాడు చందూ!

మాటా పలుకూ లేకుండా సైకిలుకున్న పాల క్యాన్లను రోడ్డువారగా పడేసి, పరుగెడుతున్న వ్యక్తి వైపుగా స్పీడ్‌గా సైకిలు తొక్కుతూ వెళ్ళిపోయాడు.

పాలవాడు రోడ్డు వారనున్న పాలక్యాన్లను చూసుకుంటూ అయోమయంలో పడి ‘లబోదిబో’మని మొత్తుకోసాగాడు. అప్పటికి గాని రోడ్డెక్కిన సగం గుంపు ‘‘దొంగేడి? ఎక్కడ?’’ అని పాలవాణ్ణి చుట్టుముట్టారు.

‘‘దొంగో దొరో నాకేటి తెలుసయ్యా బాబూ! నా




సైకిలును దౌర్జన్యంగా నా నుంచి ఊడబెరుక్కుని నా పాల క్యాన్లను ఇలా పడేసి వెళ్ళిపోయాడు. అతనుగానీ దొంగ కాదు గదా!'' అన్నాడు పాలవాడు.

ఇంతలో అటుగా వెనుక వైపు నుంచి పోలీసు వ్యాన్ వచ్చి గుంపును చూసి ఆగింది.

వ్యాన్ చుట్టూ చేరి, దొంగ విషయం గలభాగా చెప్పారు అంతా.

''నా సైకిలునూ ఎత్తుకెళ్ళాడు బాబోయ్'' అన్నాడు పెద్దగా రోదన చేస్తూ పాలవాడు.

''అయితే నువ్వెక్కు వ్యాన్'' అన్నాడు ఎస్.ఐ. గారు.

''నేనండయ్యా!'' అన్నాడు దగ్గరకొచ్చి పాలవాడు.

''నీ సైకిలు వేసుకెళ్ళినవాణ్ణి గుర్తుపడతావా'' అన్నాడు.

తల ఊపాడు పాలబ్బి.

''అయితే పద'' అన్నాడు పాలవాణ్ణి మెడపట్టి వ్యానులోకి నెట్టి.

వ్యాన్ స్టార్టయింది స్పీడుగా.

ఓ ఫర్లాంగు దూరం దాటగానే సైకిలు కనిపించింది.

సైకిలు నడిపిస్తూ ఉరుకుతున్నాడతను.

''ఇతనే. ఇతనేనండి ఎస్.ఐ. గారూ?'' అని గావు కేక పెట్టాడు పాలబ్బి గుర్తుపట్టి.

ఆ మాట వినపడగానే వ్యాను సైకిలుకు అడ్డంగా తిరిగి ఆగింది. చందూను, సైకిలును వ్యాన్‌లో వేసుకుని అందులోనే ఉతకడం ప్రారంభించారు చందూను. అతను చెప్పిన అక్షరం ముక్క కూడా వినిపించుకో లేదు.

''ఈ సైకిలు నీదేనా?'' అన్నాడు ఎస్.ఐ. గారు వ్యాన్ దిగగానే.

''అవునండి'' అన్నాడు పాలబ్బి సైకిల్ని బాగా చూసి.

''అయితే తీసుకెళ్ళు! పాలు పంచడం అయిన తరువాత స్టేషనుకు రా. ఏం?'' అన్నాడు గద్దిస్తున్నట్టు.

''అలాగేనండి'' అని అక్కడ నుంచి బయటపడి సైకిలుకు పంచరేయించుకుని ఆఘమేఘాలపైన పాల క్యానులున్న చోటుకు వచ్చేసాడు.

గుంపు కదలక మెదలక అక్కడ నిల్చుని కనిపించారు.

పాలబ్బి రాగానే సవాలక్ష ప్రశ్న లేశారు చుట్టూ మూగి. 'పొద్దుటే ఎవరి మొఖం చూసావో!' అను కుంటూ, ''దొంగ దొరికాడండి' అని ఒక్క మాట అని పాలక్యానులు కట్టుకుని దోవెంటపడ్డాడు.

''అయితే పదండి స్టేషనుకు'' అన్నారొకరు గుంపులో.

మంచిదన్నట్టు తలలాడించారంతా.

కానీ అంతా బయలు దేరలేదు.

స్టేషను దాకా వచ్చేసరికి నల్గురయిదుగురు మాత్రం మిగిలారు. మెల్లగా సెంట్రీ నడిగి స్టేషనులోకెళ్ళారు.

ఎదురుగ్గా ఉన్న సెల్‌లో 'చందూ' కనిపించి అవాక్కయిపోయారు.

''రాములు బాబాయ్! నేను! చందూనే! నన్ను దొంగని పట్టుకున్నారు. నేనేం చెప్పినా వినిపించుకో లేదు. పైగా నా నోరు మూయించి, దెబ్బలు కొట్టి మరీ లోపల వేశారు'' అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

''అసలునువ్వెందుకు సైకిలు తీసుకున్నావురా?'' అన్నాడు రాములు గారు దగ్గరగా వచ్చి.

సైకిలయితే దొంగ త్వరగా దొరుకుతాడని- తీసు కుని వెంట బడ్డాను. దొంగ దగ్గరలోకొచ్చాడను కొనేసరికి ఖర్మకాలి సైకిలు వెనక చక్రంలో గాలి పోయింది. సైకిలుతో లగెత్తుకెళ్తుంటే ఎల్.ఎం. గారి సందులో దూరాడు. ఇంకొంచెం వేగం పెంచి వెంబ డించబోయేసరికి వీళ్ళొచ్చి నన్ను వ్యాన్‌లో వేసుకుని ఇలా పట్టుకొచ్చారు'' అని ఏకరువు పెట్టాడు.

''షటప్! దొంగ వెధవ! ఇంకా కథలు చెప్తున్నావ్రటా!'' అంటూ హెడ్‌గారు లోపలనుంచి వచ్చాడు గుడ్లురిమి చూస్తూ

''హెడ్ గారూ! వీడు నిజంగా దొంగ కాదండి. దొంగను పట్టుకునేందుకు తెగింపుగా ముందుకొచ్చిన వాడు- పరుగెడుతున్న దొంగను సైకిలు పైన వెంబ డిస్తే తేలికగా పట్టుకోవచ్చుననే ఉద్దేశ్యంతో వాడు చేస్తే, వాడే దొంగని మీరు లోన వేసి అసలు దొంగను వది లేసారు''అన్నాడు రాములుగారు.

ఇంతలో ఎస్.పి. గారు వచ్చి ''వచ్చిన నల్గుర్నీ లోనకు పిలచి ''దొరికిన చందూయే దొంగ'' అని ఖచ్చితంగా చెప్పి, వచ్చినవాడి మనుష్యుల్ని గదిమి హాల్ బయటకు వెళ్ళగొట్టాడు. చందూకు కోర్టు దర్శనం, ఆ తరువాత నెలరోజుల శిక్ష- ఏ న్యాయమూ, ధర్మమూ తప్పించలేకపోయాయి.

